ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. షాపూర్‌నగర్‌లోని తన నివాసానికి నియోజకవర్గ పరిధిలో పలు సంక్షేమ సంఘాల నాయకులు శుక్రవారం తరలివచ్చి స్థానికంగా నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రజా సమస్యలు పట్టడం లేదని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయిస్తానన్నారు.

కల్లుగీత సహకార సంఘం ఎన్నిక ఏకగ్రీవం



నూతనంగా ఎన్నికైన సభ్యులు

జగద్గిరిగుట్ట: కల్లుగీత సహకార సంఘం అధ్యక్షుడిగా గూడ ఐలయ్య గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జగద్గిరిగుట్ట శ్రీనివాస్‌నగర్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో నిర్వహణ అధికారులు శ్రీకాంత్, హరి పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో తిరిగి ఏకగ్రీవంగా ఎన్నుకున్న మగ్దూంనగర్, శ్రీనివాస్‌నగర్, ఎన్టీఆర్‌నగర్ కల్లుగీత సహకార సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఉపాధ్యక్షుడిగా కె విఠల్ గౌడ్, కార్యదర్శిగా డి సాయిల్ గౌడ్, డైరెక్టర్స్‌గా పెద్దబాల్ అంజన్ గౌడ్, పరకాల సత్యలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైనవారిలో ఉన్నారు.

కొనసాగుతున్న కూల్చివేతలు



గదిని కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలంలో వెలసిన అక్రమ నిర్మాణాల కూల్చివేతలు కొనసాగుతున్నాయి. గాజులరామారం కట్టమైసమ్మ బస్తీ సర్వేనంబర్–329 ప్రభుత్వ స్థలంలో వెలిసిన గది, ఒక బేస్‌మెంట్‌ను కుత్బుల్లాపూర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం కలీం నేతృత్వంలో శుక్రవారం కూల్చి వేశారు. తక్కువ ధరకే వస్తుందని ప్రభుత్వ స్థలాన్ని కొని మోసపోవద్దని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రజలకు సూచించారు.

అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న మాజీ కౌన్సిలర్

సుభాష్‌నగర్: దుండిగల్ మున్సిపల్ బహదురపల్లిలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో 5 గదులు నిర్మించేందుకు ఓసాట్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ ముందుకు వచ్చింది. మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ గదుల నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం ఓసాట్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ముందుకు రావడం అభినందనీమన్నారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం

దుండిగల్: మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి ఆరోపించారు. దుండిగల్ మున్సిపల్ సర్వే నంబర్–131లోని డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయంలోని 6వ బ్లాక్ వద్ద రూ.2 లక్షల ఎంపీ లాడ్స్ నిధులతో వేయిస్తున్న బోరు పనులను నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఆయన వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్వర్ చారి, రాష్ట్ర ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు శ్యాంరావు, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, ఆకుల మల్లేశ్, యాదగిరి, యువమోర్చా నాయకులు ఆకుల విజయ్, వెంకటేశ్ నాయక్, యశ్వంత్ రెడ్డి, అఖిల్ గణేశ్ తదితరులు ఉన్నారు.

‘ప్రత్యేక’ పాలనపై కోటి ఆశలు!

- స్పెషల్ ఆఫీసర్ల నియామకం
- గత అసంపూర్తి పనులతో ప్రజలకు తప్పని ఇబ్బందులు
- నిధుల లేమితో కొనసా... గుతున్న అభివృద్ధి పనులు
- ప్రత్యేక అధికారులు దృష్టి సారించాలంటున్న పట్టణవాసులు

ముగిసిన ‘పురపాలికల’ పదవీకాలం



నాలుగేళ్లుగా అసంపూర్తిగానే..

సాక్షి, సిటీబ్యూరో: జిల్లాలోని పురపాలక సంఘాల పాలకవర్గా కాలపరిమితి ముగిసింది. చైర్మన్ల స్థానంలో ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టారు. పాలకవర్గాలకు మొదటి రెండేళ్లు కోవిడ్–19తో సరిపోయింది. మిగిలిన మూడేళ్ల పాలనలో ఆశించిన మేర అభివృద్ధి కనిపించక ప్రజలు తీవ్ర నిరాశకు లోనయ్యారు. ఈ పరిస్థితుల్లో పురాలకు ప్రత్యేక అధికారులు నియమితులయ్యారు. వారి ప్రత్యేక పాలన పైనే పురప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

- నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో కొత్తగా ఏర్పడిన నాలుగు మున్సిపల్ కార్పొరేషన్లసహా తొమ్మిది మున్సిపాలిటీల్లో జరిగిన అభివృద్ధి ఒకడగు ముందుకు రెండు అడుగులు వెనక్కులా ఉంది. పట్టణాల్లో పన్నుల వసూళ్లపై చూపిన శ్రద్ధను పురపాలికలు అభివృద్ధిపై చూపకపోవటంతో ప్రజలు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు.
- కొన్ని పురపాలికల్లో చిన్న పాటి వర్ష పడితే చాలు రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. ఎడతేరిపి లేకుండా వర్షం కురుస్తే లోతట్టు ప్రాంతాలు, మురికి వాడలు వరదమయంగా మారుతుండగా, రోడ్లన్నీ అస్తవ్యస్తంగా నడవలేని స్థితికి చేరుతుండటంతో ప్రజలకు ఈతీ బాధలు తప్పటం లేదు. ప్రధాన, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ తీరు చెప్పనలవి కాదు.
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్లు, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, కొంపల్లి, దుండిగల్, తూంకుంట, దమ్మాయిగూడ, నాగారం, ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలుగా ఏర్పడినా ఇక్కడి ప్రజలు సమస్యలతో సతమతం అవుతున్నారు.
- శివారు పట్టణాలను హైదరాబాద్ నగరానికి సమాంతరంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఎన్ని ప్రణాళికలు రూపొందించినా ప్రజాప్రతినిధుల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యంగా కారణంగా ముందుకు అభివృద్ధి ఆశించిన స్థాయిలో లేదు.

ఎక్కడి సమస్యలు అక్కడే...

పురపాలక సంఘాల్లో ఎక్కడ సమస్యలు అక్కడనే మూలుగుతున్నాయి. చెత్తాచెదారం, డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యలతో ప్రజలు అల్లాడుతున్నారు. గ్రామానికి తక్కువ, పట్టణానికి ఎక్కువ అరే దీటీలో పురపాలక సంఘాల్లో అభివృద్ధి సాగుతోంది. ఖాళీ స్థలాల్లో పేరుకపోయిన చెట్ల పొదలు, చెత్తాచెదారంతో పెరిగిన దోమల బాధను భరించలేని పరిస్థితులను ప్రజలు ఎదుర్కోవాల్సి వస్తోంది. మూసీ నది పరీవాహక ప్రాంతాల్లో దోమలు అధికమవుతున్నాయి. సాయంత్రం 6 గంటలు దాటితే పలు కాలనీలు, బస్తీల్లో ఐదు నిమిషాలు కూడా బయట నిలబడలేకపోతున్నారు. పలు పురపాలికల్లో రోడ్లపై పారుతున్న మురికి, సైడు కాలువలతో స్థానికులు దోమల బాధ భరించలేకపోతున్నారు. ఈ సమస్యలపై ప్రత్యేక అధికారులు దృష్టి సారించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

జిల్లాలోని 13 పురపాలక సంఘాల్లో సమీకృత మార్కెట్లకు అర ఎకరం నుంచి రెండు ఎకరాల చొప్పున 16.82 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది.

- జవహర్‌నగర్, నిజాంపేట్, బోడుప్పల్, పీర్జాదిగూడ కార్పొరేషన్లలో మార్కెట్ల భవన సముదాయాలు, పార్కింగ్ నిర్మాణానికి రూ. 4.5 కోట్ల చొప్పున, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, కొంపెల్లి, దుండిగల్, తూంకుంట, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీల్లో మార్కెట్ల నిర్మాణానికి రూ. 2 కోట్ల చొప్పున అప్పటి సర్కారు నిధులు మంజూరు చేసింది. ఆ నిధుల విడుదల జాప్యంతో నాలుగున్నరేళ్లు గడిచినా ఇప్పటి వరకు ఒకటి కూడా ప్రజలకు అందుబాటులోకి రాలేదు.

పన్నులు సరే.. అభివృద్ధి ఏదీ..?

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాల నుంచి పన్నుల ద్వారా రూ. 175 కోట్లు వస్తుండగా, 15వ ఆర్థిక సంఘం ద్వారా కూడా ప్రతి నెల ఒక్కో పురపాలక సంఘానికి రూ. 3 లక్షల నుంచి రూ. 21 లక్షల నిధులు విడుదలవుతున్నాయి. ఈ నిధులన్నీ ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులకు వెచ్చించాల్సి ఉన్నా పట్టించుకోక పోవటంతో అవికాస్తా అభివృద్ధికి నోచుకోలేదు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కొంపల్లి సెక్షన్ ఏఈ శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ నూజివీడు ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు శ్రీనివాసకాలనీ, విటిస్ విల్లాస్, అశ్విన్ కాలనీ, 11కేవీ గార్డెన్ సొసైటీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు కేవీఆర్ రోడ్డు, జయభేరి కాలనీ, గార్డెన్ సొసైటీ, ఉమామహేశ్వర కాలనీ, 11కేవీ జయభేరి ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శ్రీనివాసకాలనీ, జయభేరి శివాలయం రోడ్డు, బ్యాంక్ కాలనీ, 11కేవీ వెన్‌సాయి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు శ్వేత శుభం రోడ్డు, రాయల్ మీడోవ్స్, విఘ్నేశ్వర ఫీడర్ పరిధిలో 1.30 నుంచి 2 గంటల వరకు రుద్ర అపార్ట్‌మెంట్స్, మోడీ బిల్డర్స్, ప్రజేయ్ అపార్ట్‌మెంట్స్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

చింతల్‌లో..

చింతల్: మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బోయిన్‌పల్లి ఏడీఏ శ్రీకాంత్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు బోయిన్‌పల్లి సబ్‌స్టేషన్ ప్లాసి లైన్ ఫీడర్ పరిధిలో ప్లాసి లైన్, ఆర్ఆర్‌నగర్ రోడ్ నంబర్–1 అండ్ రోడ్ నంబర్–10, బోయిన్‌పల్లి చెక్ పోస్ట్, కరెంట్ ఆఫీస్, హోండా షోరూం, శ్రీ సాయి కాలనీ శారద ఆగ్రో, ఆరోమార్ భవన్, ఎంబీ ఎం ఎస్టేట్, నందమూరినగర్, మెట్రోస్టేషన్, సాయిబాబా టెంపుల్, ఎంఎంఆర్ గార్డెన్స్. పెన్షన్ లైన్ ఫీడర్ పరిధిలో పెన్షన్ లైన్, ఆర్య సమాజ్, కంసరి బజార్, మెస్ పిటి, పెద్దతోకట్ట, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బోయిన్‌పల్లి సబ్‌స్టేషన్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (విమల్ థియేటర్) ఫీడర్ పరిధిలో ఫతేనగర్, శాస్త్రినగర్, పైప్ లైన్ రోడ్, భగత్‌సింగ్ పార్క్, నియర్ గవర్నమెంట్ స్కూల్, పైప్లైన్ రోడ్, ఫతేనగర్ ఫీడర్ పరిధిలో ఫతేనగర్, శాస్త్రినగర్ నియర్ రైల్వే ట్రాక్ శ్రీహరి బిల్డింగ్స్, సాయి రెసిడెన్సీ, గౌతమ్‌నగర్ ఫీడర్ పరిధిలో గౌతమ్‌నగర్, ఓల్డ్ ఎయిర్‌పోర్ట్ రోడ్, గౌతమ్ నగర్, ఎస్ఎస్ కేకే స్కూల్, శ్రీ సాయినాథ్ నగర్, మహాత్మానగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఘనంగా గద్దర్ జయంతి వేడుకలు



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు

జగద్గిరిగుట్ట : జగద్గిరిగుట్ట చివరి బస్టాప్ అంబేడ్కర్ విగ్రహం వద్ద గద్దర్ జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు గద్దర్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గద్దర్ తెలంగాణ మలిదశ, చివరి దశ ఉద్యమంలో కాళ్లకు గజ్జలు కట్టుకుని, గొంగడితో సబ్బండ వర్గాలను ఉద్యమంలో పాల్గొనేటట్లు చేశారని కొనియాడారు. గద్దర్ మృతి చెందినప్పుడు ప్రధాని మోడీ తన సంతాపం తెలియజేశారని, అంతేగాకుండా అనేక సభలు, సమావేశాల్లో బీజేపీ నాయకులు గద్దర్‌ను గౌరవించారని గుర్తు చేశారు. అది తెలుసుకోకుండా గద్దర్‌పై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడడం తగదన్నారు. కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యుడు హరినాథ్, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు ప్రవీణ్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు రాములు, దుర్గయ్య, వెంకటేశ్, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు, ఎంజేఎఫ్ జిల్లా కార్యదర్శి యాకయ్య, లాలయ్య సార్, సోమన్న, ప్రభాకర్, సామిల్, ముసలయ్య, రవి, యాదగిరి, బాబు, జర్నలిస్టు నాయకులు తొండ వెంకట్, గణేశ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు డాక్యుమెంట్లతో స్థలం కబ్జాకు యత్నం

నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు..



పోలీసులు అరెస్టు చేసిన అనిల్‌కుమార్ వర్మ

దుండిగల్: నకిలీ ధ్రువీకరణపత్రాలు సృష్టించి స్థలాన్ని కాజేసిన వ్యక్తిని దుండిగల్ పోలీసులు అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. జానకీదేవికి దుండిగల్ మున్సిపల్ డీపోచంపల్లి పరిధిలోని సర్వే నంబర్ 317/1లో వ్యవసాయ భూమి ఉంది. అందులో 2.17 గుంటల భూమిని సైమెడ్ ల్యాబ్స్‌కు చెందిన చంద్రప్రకాశ్‌రావుకు విక్రయించింది. తదనంతరం మోహన్‌రావు అనే వ్యక్తి చంద్రప్రకాశ్‌రావు నుంచి కొనుగోలు చేశారు. అయితే సదరు స్థలంలో ఖాళీగా ఉన్న 17 గుంటల భూమిపై కన్నేసిన ఖైరతాబాద్‌కు చెందిన అనిల్‌కుమార్ వర్మ కాజేసేందుకు పన్నాగం పన్నాడు. ఈ క్రమంలో జానకీదేవి బదులుగా మరో మహిళా పేరుతో తప్పుడు డాక్యుమెంట్లను సృష్టించాడు. ఈ క్రమంలో బొంగునూరు మానస పేరుతో సేల్‌డీడ్ రూపొందించి స్థలాన్ని విక్రయించేందుకు యత్నించాడు. దీనిపై స్థల యజమాని దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మేడ్చల్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలతో శుక్రవారం సీఐ సతీశ్, ఎస్ఐలు శంకర్, రంజిత్‌కుమార్ నేతృత్వంలో సిబ్బంది ఖైరతాబాద్ ఆనంద్‌నగర్‌లోని తన నివాసంలో అనిల్‌కుమార్ వర్మను విచారించగా నేరం అంగీకరించాడు. ఈ మేరకు అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ



జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మేడ్చల్ రవాణా శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ సైకిల్ లిస్ట్ గ్రూప్, ది రాయల్ క్లబ్ ఆఫ్ రైడర్స్ గ్రూప్ సభ్యుల భాగస్వామ్యంతో పేట్ బషీరాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం రోడ్డు భద్రతా అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, జిల్లా రవాణా అధికారి రఘునాథ స్‌గౌడ్, అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు, ఎంవీఐ సాధుల శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, శ్రీనుబాబు, శిల్పా, ఉమా, శ్రీకాంత్ రెడ్డి, హైదరాబాద్ సైకిల్ లిస్ట్ గ్రూప్ సైక్లిస్ట్ రవీందర్, బైక్ రైడర్ జై భారతి, రవాణా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ

దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు శంభీపూర్‌లోని తన కార్యాలయంలో ఆయనను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

ఫాక్స్‌సాగర్ ప్రాంతంలో హైడ్రా అధికారుల పర్యటన

ఆక్రమణల పరిశీలన

జీడిమెట్ల: ఫాక్స్‌సాగర్ ప్రాంతాన్ని హైడ్రా అధికారులు శుక్రవారం పరిశీలించారు. చెరువు స్థలాన్ని కొంతమంది అక్రమార్కులు కబ్జా చేసినట్లు పలు పత్రికల్లో కథనాలు ప్రచురితం కావడంతో పాటు అధికారులకు సైతం స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో హైడ్రా టీం పద్మజ, ప్రవీణ్‌కుమార్, పద్మయ్య ఫాక్స్‌సాగర్ ప్రాంతంలో పర్యటించారు. ఫాక్స్‌సాగర్ పాత శాటిలైట్‌మ్యాప్ ఆధారంగా ఆక్రమణలు గుర్తించినట్లు వారు తెలిపారు.

ఫాక్స్‌సాగర్ చుట్టూ పరిశీలన..

ఫాక్స్‌సాగర్ చుట్టూ అధికారులు కలియతిరిగారు. ఫాక్స్‌సాగర్ చుట్టూ రోడ్లు ఎందుకు వేశారు..? రోడ్లను ఏర్పాటు చేసే క్రమంలో రోడ్డుకు ఆవలివైపు ఉన్న ఫాక్స్‌సాగర్ స్థలాలను ఎందుకు వదిలేశారు..? అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఫాక్స్‌సాగర్ వద్ద ఉన్న పాత హద్దులను ఎందుకు తొలగించారు..? అనే విషయాన్ని పలువురిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొంపల్లివైపు ఉన్న ఉమామహేశ్వరకాలనీలో ప్రాంతంలో పర్యటించారు.

కబ్జాదారులు పరార్..

హైడ్రా అధికారులు స్థానికంగా పర్యటిస్తున్న విషయం తెలుసుకున్న స్థానిక ఆక్రమణదారులు అక్కడ నుంచి పలాయనం చిత్తగించారు. ఇప్పటికే ఫాక్స్‌సాగర్ స్థలంలో కొంతమంది అక్రమ దందాలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ.. నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

అనుమతుల్లేని నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి



అధికారులకు ఫిర్యాదు చేస్తున్న నరేంద్ర చౌదరి

నిజాంపేట్ : ప్రగతినగర్‌లో జీపీ, మున్సిపల్ అనుమతులతో నిర్మించిన అపార్ట్‌మెంట్లలో కొంతమంది ఫ్లాట్ ఓనర్స్ మున్సిపల్ శాఖ అనుమతుల్లేకుండా రెసిడెన్షియల్ ఫ్లాట్లను కమర్షియల్‌గా మారుస్తున్నారని ప్రగతినగర్ బీజేపీ అధ్యక్షుడు నరేంద్ర చౌదరి పేర్కొన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విషయమై మున్సిపల్ అధికారులకు అవగాహన ఉన్నప్పటికీ పర్యవేక్షించి చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారన్నారు.

రేణుకా ఎల్లమ్మ, పోచమ్మ ఆలయ వార్షికోత్సవం

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్‌లోని గాలిపోచమ్మ బస్తీలో శ్రీరేణుకా ఎల్లమ్మ, పోచమ్మ ఆలయ వార్షికోత్సవం శుక్రవారం కనుల పండువగా జరిగింది. డప్పు చప్పుళ్ల మధ్య బోనాలు, తొట్టెలను ఊరేగించారు. మహిళలు బోనాలతో వచ్చి అమ్మవారికి సమర్పించారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హనుమంతరెడ్డి, అఖిల భారత వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాసు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ నరసింహ, శ్రీను వీఐపీలకు స్వాగతం పలికారు. అదేవిధంగా దుండిగల్ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర నాయక్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మాజీ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, హరి నాయక్, ఎల్లుగారి వేణు పాల్గొన్నారు.

సినీ నిర్మాత వేదరాజు టింబర్ మృతి



వేదరాజు టింబర్ (ఫైల్)

మోతీనగర్: మోతీనగర్‌కు చెందిన సినీ నిర్మాత, ఎంసీహెచ్ఎస్ సీనియర్ సభ్యుడు వేదరాజు టింబర్ (54) అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. మోతీనగర్‌లోని ఆయన నివాసంలో టింబర్ మృతదేహాన్ని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిన్నగారి లక్ష్మారెడ్డి, ఏపీ పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, పలువురు రాజకీయ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీర రాఘవరెడ్డి, ఎంసీహెచ్ఎస్ అధ్యక్షుడు సీహెచ్ హనుమంతరావు, మాజీ అధ్యక్షులు నలమాల్పు అంజిరెడ్డి, బిజముల్ల నాగేశ్వరరావు, మోతీనగర్‌వాసులు తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్లకు సన్మానం



కమిషనర్ వెంకటేశ్‌నాయక్‌ను సత్కరిస్తున్న కృష్ణారెడ్డి తదితరులు



కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

దుండిగల్: దుండిగల్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ వెంకటేశ్ నాయక్‌ను శుక్రవారం బీజేపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని, పెండింగ్ పనులు సత్వరమే పూర్తయ్యేలా చూడాలని విన్నవించారు. కలిసిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్వర్ చారి, రాష్ట్ర ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు శ్యాంరావు, మున్సిపల్ జీఎస్ శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి ఆకుల మల్లేశ్, యాదగిరి, యువమోర్చా నాయకులు ఆకుల విజయ్ వెంకటేశ్ నాయక్, యశ్వంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కొంపల్లి మున్సిపల్ కమిషనర్‌ను..

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన కృష్ణారెడ్డిని కొంపల్లి బీజేపీ అధ్యక్షుడు సతీశ్‌సాగర్ ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. బీజేపీ జిల్లా నాయకులు రాజిరెడ్డి, జనార్దన్ రెడ్డి, మహిళా మోర్చా నాయకురాలు సరితరావు, అసెంబ్లీ కో–కన్వీనర్ శివాజీరాజు, మున్సిపల్ నాయకుడు గోపాల్ రెడ్డి ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆటోడ్రైవర్ మృతి




శరత్‌బాబు (ఫైల్)

జీడిమెట్ల: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆటో డ్రైవర్ మృతిచెందిన ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ హరిజనవాడకు చెందిన డప్పు శరత్‌బాబు (38) తన ఆటోలో న్యూస్‌పేపర్ తీసుకెళ్తుంటాడు. రోజు మాదిరిగానే శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఆటోలో న్యూస్‌పేపర్ తీసుకుని షాపూర్ నుంచి ఐడీపీఎల్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆటోను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టగా బోల్తాపడి శరత్‌బాబు అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతుని భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీ ఫుటేజీల ఆధారంగా గుర్తు తెలియని వాహనాన్ని గుర్తిస్తామని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు మృతి..

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ అల్వాల్ కుమ్మరిబస్తీకి చెందిన నేమూరి శంకర్‌గౌడ్ (65) ఈనెల 26 ఇంటి నుంచి వెళ్లాడు. 2 రోజులైనా ఇంటికి రాకపోవడంతో కుమారుడు సంతోష్‌కుమార్ అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా గురువారం రాత్రి 11 గంటల సమయంలో శంకర్‌గౌడ్ చింతల్ ఆర్ఎస్‌సీ హాస్పిటల్ మెయిన్ రోడ్డు నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా షాపూర్ నుంచి బాలానగర్ వెళ్తున్న డీసీఎం వాహనం వెనక నుంచి ఢీకొట్టింది. ఈ విషయమై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయగా తీవ్రంగా గాయపడ్డ శంకర్‌గౌడ్‌ను పోలీసులు 108 అంబులెన్స్‌లో గాంధీ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించి శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు మృతిచెందాడు. కాగా మొదటగా గుర్తు తెలియని వ్యక్తి మృతిగా పోలీసులు భావించారు. శంకర్‌గౌడ్‌పై అల్వాల్ పీఎస్‌లో అదృశ్యమైన కేసు ఉండగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు సంతోష్‌గౌడ్ ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన సిబ్బంది



మాట్లాడుతున్న ఆచార్య వెలుదండ నిత్యానందరావు

నిజాంపేట్ : యూజీసీ వేతనాలు పొందుతున్న విశ్వవిద్యాలయాల అధ్యాపకుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 65 ఏళ్లకు పెంచుతూ సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడంపై తెలుగు విశ్వవిద్యాలయ బోధన సంఘం కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సీఎం కృతజ్ఞత సభలో తెలుగు విశ్వ విద్యాలయ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బోధన సిబ్బంది వయస్సు పెంపు నిర్ణయం చారిత్రాత్మకమైనదని, ఇది ఉన్నత విద్య అభివృద్ధికి మరింత దోహదపడుతుందన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు మాట్లాడుతూ.. విద్యారంగం అభివృద్ధికి ఈ నిర్ణయం ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ బోధనా సంఘం అధ్యక్షురాలు డా.వనజ ఉదయ్, తెలుగు విశ్వవిద్యాలయం సంగీత శాఖాధిపతి డా.రాధా సారంగపాణి, డా.పద్మప్రియ, డా.రత్నశ్రీ, డా.గడ్డం వెంకన్న, డా.మరపు వెంకటేశం, డా.ఓని విజయ్ పాల్గొని ప్రసంగించారు.